క్లుప్తంగా

రూ.25కే జాతీయ జెండా



జాతీయ జెండా చూపుతున్న పోస్టల్ అధికారులు

కళ్యాణదుర్గం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కళ్యాణదుర్గం డివిజన్‌లోని అన్ని పోస్టాఫీసుల్లో రూ.25కే జాతీయ జెండా విక్రయిస్తున్నామని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర రావు, సబ్ పోస్ట్‌మాస్టర్ నరేంద్ర తెలిపారు. స్థానిక సరోజా కాంపౌండ్‌లో సోమవారం జాతీయ జెండాలను ప్రజలకు అందించారు. పది రోజులుగా జాతీయ జెండాలను అందిస్తున్నామన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంటీలు మల్లికార్జున, తిమ్మరాజు, రాజుకుళ్లాయి, మద్దిలేటి, రామశేషు, పావని తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో వ్యక్తికి గాయాలు

శెట్టూరు: మండలంలోని అనుంపల్లిలో ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణలో రాజన్న అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం ఉదయం రాజన్న పాలు తీసుకుని రోడ్డుపై వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఈరన్న, అశోక్ అనే వ్యక్తులు గొడవకు దిగి దాడి చేశారు. దాడిలో రాజన్న తలకు తీవ్ర గాయమైంది. అతడిని వెంటనే కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. ఉద్దేశపూర్వకంగానే తనపై దాడి చేశారని రాజన్న ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యువరాజ్ తెలిపారు.

నీటి సమస్య పరిష్కరించండి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 17, 18 వార్డుల పరిధిలోని అజాద్ మున్సిపల్ స్కూల్ వద్ద నెలకొన్న కలుషిత తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కాలనీవాసులు మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప, కౌన్సిలర్లు మంజునాథ, వార్డు ఇన్‌చార్జ్ బషీర్ అహ్మద్, డీఈ సురేష్‌కు వినతిపత్రాలు అందజేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ రెండురోజుల్లో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బొమ్మనహాళ్: రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలకు దర్గాహొన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కె. రవిప్రకాష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న ఉరవకొండ పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన సెపక్‌తక్రా జిల్లా స్థాయి బాల బాలికల క్రీడా పోటీల్లో దర్గాహొన్నూరు పాఠశాలకు చెందిన ఎం. సుప్రతిక బాలికల విభాగంలో, బి. రంజిత్ బాలుర విభాగంలో ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పేరెంట్స్ కమిటీ చైర్మన్ వన్నూరుస్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు హలీమా, కృష్ణ అభినందించారు.


అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి



ఉమేష్(ఫైల్)

బ్రహ్మసముద్రం: బ్రహ్మసముద్రం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే కానిస్టేబుల్ జి .ఉమేష్(40) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. మెడికల్ లీవ్‌లో ఉంటూ.. ఇటీవల చికిత్సచేయించుకుని తిమ్మగానిపల్లిలోని తన స్వగృహంలో ఉంటున్నాడు. సోమవారం ఉమేష్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారని ఎస్‌ఐ పరుశురాముడు తెలిపారు. అతడికి భార్య అనిత, ఓ కుమారుడు ఉన్నారు.

'భూ హక్కు' పథకంతో ప్రయోజనం



రీ సర్వే ప్రారంభిస్తున్న అధికారులు

వజ్రకరూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్, జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కేశవరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రాగులపాడులో రీసర్వే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ల వారిగా హద్దు రాళ్లు లేకపోవడం వల్ల అనేక చోట్ల సరిహద్దుల్లో వివాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. రీ సర్వేతో ప్రతి సర్వే నెంబరుకు ఉచితంగా సర్వే, భూ రక్ష హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మంజుల, వీఆర్వో శ్రీధర్, సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

బోగస్ ఓట్లకు చెక్!

- పక్కాగా ఓటరు జాబితా వెరిఫికేషన్
- ఇంటింటా తనిఖీ చేస్తున్న బీఎల్‌ఓలు



కళ్యాణదుర్గం పట్టణంలో ఓటరు జాబితాను వెరిఫికేషన్ చేస్తున్న ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఓటరు జాబితా వెరిఫికేషన్ పక్కాగా కొనసాగుతోంది. బోగస్ ఓట్లకు చెక్ పెడుతూ ఓటరు జాబితాను రూపొందించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపొందించేందుకు అధికారులు ముమ్మర చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్తూ బోగస్ ఓట్ల ఏరివేతను చేపట్టారు.

పకడ్బందీగా వెరిఫికేషన్

కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో మొత్తం 6,92,107 ఓటర్లు ఉండగా 2,62,731 కుటుంబాలున్నాయి. ఇందులో ఇప్పటి వరకు 1,93,830 ఇళ్ల పక్కాగా సర్వే చేసి 4,28,125 ఓట్లను వెరిఫికేషన్ చేశారు. ఎక్కడా ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా పక్కాగా ఓటరు జాబితాను రూపొందించడానికి అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో స్వచ్ఛమైన ఓటరు జాబితాను రూపొందించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా డోర్ టు డోర్ వెళ్తూ బీఎల్వోలు సర్వే చేపడుతున్నారు. సర్వేలో డోర్ నంబర్లు జీరో ఉన్న వాటిని, మరణించిన వారి వివరాలు, డబుల్ ఎంట్రీ ఉన్న వారి వివరాలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఒకే పేరుపై ఉన్న ఓటర్లను వారి ధృవీకరణ పత్రాలు పరిశీలించి నిశితంగా తనిఖీ చేస్తున్నారు. ఒకేసారి పదుల సంఖ్యలో డిలీట్ చేసినా, కొత్తగా నమోదు చేసినా అలాంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచారు.

క్లస్టర్‌లో వివరాలు ఇలా..

మండలం	మొత్తం ఓటర్లు	మొత్తం కుటుంబాలు	వెరిఫికేషన్ చేసిన కుటుంబాలు	వెరిఫికేషన్ చేసిన ఓటర్లు
కళ్యాణదుర్గం	2,22,234	92,143	70,979	1,28,800
రాయదుర్గం	2,54,392	99,200	67,851	1,71,325
ఉరవకొండ	2,15,481	71,388	55,000	1,28,000
మొత్తం	6,92,107	2,62,731	1,93,830	4,28,125

తప్పుల్లేని ఓటరు జాబితాను రూపొందిస్తాం

తప్పుల్లేని ఓటరు జాబితాను రూపొందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే బీఎల్‌ఓలను ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను నిశితంగా పరిశీలించాలని ఆదేశించాం. డబుల్ ఎంట్రీ, జీరో డోర్ నంబర్ వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఎలాంటి బోగస్ ఓట్లకు తావివ్వకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. దీనిపై పలు మార్లు అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించాం. నాయకుల సూచనలు సైతం పరిగణలోకి తీసుకుని స్వచ్ఛమైన ఓటరు జాబితాను రూపొందిస్తున్నాం. – నిశాంత్ రెడ్డి, ఆర్‌డీఓ, కళ్యాణదుర్గం

సంక్షిప్త సమాచారం

ఏకగ్రీవంగా వార్డు మెంబర్ల ఎన్నిక

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు గ్రామంలో బురుజు పూజిత, మారెంపల్లి గ్రామంలో కురుబ మారుతి వార్డు మెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సురేశ్‌బాబు సోమవారం తెలిపారు. ఎన్నికైన అభ్యర్థులకు ఫారం–10 ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

బరిలో ఇద్దరు అభ్యర్థులు

కూడేరు: మండలంలోని కలగళ్ల పంచాయతీలో జరిగే 9వ వార్డు మెంబర్ ఎన్నికల బరిలో పశువుల మల్లేశ్వరి, మీనుగ లక్ష్మీదేవి పోటీ పడుతున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు సోమవారం తెలిపారు.

ఎస్‌ఐకి సన్మానం

విడపనకల్లు: ఎస్‌ఐ తిప్పయ్యను సోమవారం వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న ఆధ్వర్యంలో శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు నాగరాజు, మంగలి, హనుమంతు, యువరాజు, మేకల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కూడేరు: మండలంలోని అరవకూరులో సోమవారం సంగప్ప అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు వీడియో కాల్ ద్వారా సమాచారం ఇవ్వడంతో.. వారు అక్కడికి వెళ్లి అతనిని అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు.

గద్దర్ సంతాప సభను విజయవంతం చేయండి

విడపనకల్లు: ఉరవకొండ పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద ఈ నెల 17న నిర్వహించనున్న గద్దర్ సంతాప సభను విజయవంతం చేయాలని పాల్తూరు ఆనందురాజు, కమ్యూనిస్టు నాయకుడు శివన్న, వజ్రకరూరు మాజీ ఎంపీపీ తిప్పయ్య కోరారు. సోమవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు.

తహసీల్దార్‌కు వినతి

వజ్రకరూరు: పశుసంవర్ధకశాఖ సహాయకుడు శ్రీనాథ్‌ను సస్పెన్షన్ చేస్తూ జారీచేసిన ఉత్తర్వులను ఎత్తివేయాలని, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ తహసీల్దార్ అనిల్‌కుమార్,ఎంపీడీఓ విజయలలితకు సచివాలయ ఉద్యోగులు వినతిపత్రాలు అందజేశారు. సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సంజీవరాయుడు, ఉపాధ్యక్షుడు నరేష్, స్టేట్ జాయింట్ సెక్రటరీ హనుమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్ల కలక

కణేకల్లు: కణేకల్లుక్రాస్‌లోని గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కళ్లకలకతో బాధపడుతున్నారు. మూడ్రోజుల నుంచి ఒకరి ద్వారా మరొకరి కళ్లకలక వ్యాపించింది. ప్రస్తుతం ఈ వైరస్ అదుపులో ఉందని ప్రిన్సిపాల్ వెంకటనాయుడు తెలిపారు.

నిందితునిపై కఠిన చర్యలు తప్పవు

కళ్యాణదుర్గం: మండలంలోని తూర్పు కోడిపల్లిలో ఓ వివాహిత మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన నిందితునిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ బి.శ్రీనివాసులు స్పష్టం చేశారు. బాధిత మహిళ ఈ నెల 10న ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడని కళ్యాణదుర్గం రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఎస్‌ఐ సుధాకర్ విచారణ చేశారన్నారు. అయితే బాధితురాలు నేరుగా జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావును తనకు న్యాయం చేయాలని స్పందన కార్యక్రమంలో కోరిందన్నారు. కేసు ఇంకా విచారణ జరుగుతోందని, వాస్తవమైతే నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

గొర్రెల అపహరణ

రాయదుర్గం/గుమ్మఘట్ట: గుమ్మఘట్ట మండలంలోని కలుగోడులో గుడిపల్లి బోయ లక్ష్మన్నకు చెందిన 22 గొర్రెలు గత ఆదివారం రాత్రి అపహరణకు గురయ్యాయి. బాధితుడి వివరాల మేరకు.. గ్రామంలోని రంగచేడుకు వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని గొర్రెల మంద ఏర్పాటు చేశాడు. రోజూలాగే అక్కడే నిద్రించాడు. అర్ధరాత్రి దాటక సుమారు 2:30 గంటల సమయాన లగేజీ వాహనంతో వచ్చిన దొంగలు మందలోకి చొరబడ్డారు. కాపరి అప్పటికే గాఢ నిద్రలోఉన్న విషయాన్ని గమనించి పొట్టేళ్లతో పాటు గొర్రెలను అపహరించి వాహనంలో తీసుకెళ్లారు. ఉదయం లేచిన తర్వాత అనుమానంతో కాపరి గొర్రెలను లెక్కపెట్టాడు. మందలో ఉండే 60 గొర్రెల్లో ఏకంగా 22 గొర్రెలు అపహరణకు గుయ్యాయని తెలిసి భోరున విలపించాడు. సుమారు రూ.2.50 లక్షలు నష్టం జరిగిందని, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

కళ్యాణదుర్గం రూరల్: బోరు నీటి వాడకంపై కంబదూరు మండలం కొత్తూరులో ఈ నెల 13న చోటు చేసుకున్న ఘర్షణలో ముత్యాలప్ప మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడిగా ఉన్న హతుడి సోదరుడు నరసింహులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వివరాలను కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ బి.శ్రీనివాసులు వెల్లడించారు. గొల్ల నరసింహులు, గొల్ల ముత్యాలప్ప అన్నదమ్ములు. వీరి మధ్య బోరు నీటి సరఫరా విషయమై గొడవ జరగడంతో ముత్యాలప్పపై నరసింహులు దాడి చేశాడు. ఘటనలో అపస్మారక స్థితికి చేరుకున్న ముత్యాలప్పను కుటుంబసభ్యులు వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు సోమవారం ఉదయం నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తికి గాయాలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం పక్కన రైల్వే ట్రాక్‌పై బ్రహ్మయ్య (56) అనే వ్యక్తిని గూడ్స్ రైలు ఢీకొని గాయపడ్డాడు. ఎడమ చేయి తీవ్రంగా దెబ్బతిన్నట్లు బంధువులు తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి రైల్వే ట్రాక్‌పై బహిర్భూమికి వెళ్లి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న పైలెట్ మహేష్, ఏఎంటీ రామతులసి క్షతగాత్రున్ని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

పైప్‌లైన్ ధ్వంసం

కంబదూరు: మండలంలోని అండేపల్లి గ్రామానికి చెందిన రైతు తలారి తిమ్మయ్య పొలంలో పైపులైన్‌ను ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఐదు ఎకరాల్లో ఆయన నెల రోజుల క్రితం టమాట పంట సాగు చేశాడు. పంట చేతికందే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పొలంలోని 45 పీవీసీ పైపులు, డ్రిప్ ఫిల్టర్లను ధ్వంసం చేశారు. దీంతో రూ.40 వేల వరకూ నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ రాజేష్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి పొలాన్ని పరిశీలించి న్యాయం చేయిస్తానని బాధితరైతుకు హామీ ఇచ్చాడు

నూతన పోస్టాఫీసు ప్రారంభం



నూతన పోస్టాఫీసును ప్రారంభిస్తున్న దృశ్యం

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని మలపనగుడిలో నూతన పోస్టు కార్యాలయం ప్రారంభమైంది. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో ఏళ్లనాటి కళకు సాకరమైంది. దీంతో గ్రామస్తులు పోస్టాఫీసు ప్రారంభోత్సవాన్ని సోమవారం పండుగలా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పోస్టల్ ఎస్పీ హరిప్రసాద్, సర్పంచ్ రుద్రేష్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి తపాలా కార్యాలయాన్ని ప్రారంభించారు. పోస్టల్ ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ గ్రామస్తులు పోస్టాఫీసు సేవల కోసం ఓబుళాపురానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. స్వగ్రామంలోనే సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారన్నారు. అనంతరం పార్టీ నాయకులు మాట్లాడారు.. గ్రామస్థుల చిరకాల కోరిక విప్ కాపు సహకారంతో నెరవేరిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గవిసిద్ధ, గోవర్ధన్, నారాయణ, మారేశా, దేవన్న, పోస్టల్ సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి, అనిల్, లాలూస్వామి తదితరులు పాల్గొన్నారు.

కంబదూరు: గ్రామీణులకు తపాల సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్ తెలిపారు. సోమవారం మండలంలోని గూళ్యం గ్రామంలో నూతనంగా తపాలా శాఖను సర్పంచ్ శివతో కలిసి ఆయన ప్రారంభించారు. గ్రామస్తులు తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

శెట్టూరు: ఖరీఫ్‌లో పంట సాగును ఈ–క్రాప్ నమోదు చేయించాలని తహసీల్దార్ ఫణికుమార్, ఏఓ సంధ్యాకుమారి సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ– క్రాప్‌పై విధి విధానాలు వారు వివరించారు. యాప్‌లో పంట వివరాలు, రైతు వివరాలు, ఫోటోలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి రైతు తన పంటను ఈ క్రాప్‌బుకింగ్ చేసుకొనేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఆంజనేయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఆర్బీకే సిబ్బందిన సంప్రదించి రైతులు ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి సాయికుమార్ సూచించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పంటల నమోదు దరఖాస్తు పూర్తి చేసి పాస్ ఫోటో, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, పొలం ఖాతా (వన్‌బీ, ఆర్‌ఓఆర్) ,ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు ఖాతా జిరాక్స్, ఫోన్ నంబర్‌తో ఆర్బీకే సిబ్బందిని సంప్రదించాలన్నారు.

మందులతో కుష్టువ్యాధి నయం



కుష్టువ్యాధిగ్రస్తులకు చికిత్స చేస్తున్న డీఎంఓ నాగన్న

కూడేరు: కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి మందులను క్రమం తప్పకుండా వాడితే పూర్తిగా నయమవుతుందని జిల్లా పారామెడికల్ ఆఫీసర్(డీఎంఓ) నాగన్న అన్నారు. సోమవారం మండలంలోని లెప్రసీ కాలనీలో అంగవైకల్య నివారణ, వైద్య పునరావాస శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్టువ్యాధిగ్రస్తులు కాళ్లుచేతి వేళ్ల పుండ్లు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రతలు గురించి ఆయన వివరించారు. ఎస్ఎస్ఓడీ(సోకింగ్, స్క్రాపింగ్, ఆయిలింగ్, డ్రసింగ్) తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలున్నా, నరాలు ఉబ్బినట్టు ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు.అనంతరం అవసరమైన వారందరికీ మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సరిత , హెచ్ఈ సత్యనారాయణ, డీపీఎంఓ తిప్పేస్వామి, సీహెచ్ఓ మోహన్‌బాబు, సూపర్‌వైజర్ రవీంద్ర, ఏఎన్ఎం భాను తదితరులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

రాయదుర్గంటౌన్: పట్టణ శివారులో ఉన్న మల్లాపురం లేఅవుట్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాలనీవాసులతో కలసి సీపీఎం నాయకులు బళ్లారి రహదారిపై బైటాయించి నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున మాట్లాడుతూ మల్లాపురం లేఅవుట్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగరాజు, మధు, తిమ్మరాజు, అంజి, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటుకోవాలి



వజ్రకరూరు: కొనకొండ్లలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తదితరులు



రాయదుర్గం టౌన్‌:జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప, కౌన్సిలర్లు, అధికారులు



కళ్యాణదుర్గం రూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ కమిషనర్, నాయకులు

వజ్రకరూరు: ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటుకోవాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరయ్యారు. అనంతరం నా భూమి–నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. అలాగే శిలాఫలకం ఆవిష్కరణ, మొక్కలు నాటడం, పంచ్ ప్రాణ ప్రతిజ్ఞ, వీరులను సన్మానించడం తది త ర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను బోధించి, విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచు నంచర్ల ఇందిరమ్మ, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య, ముద్దయ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రామాంజనేయులు, మాజీ ఎంపీపీ రామ చంద్ర, నాయకులు గుడిసి ప్రసాద్, తిప్పన్న, గురుప్రసాద్, దేవేంద్ర, బాలక్రిష్ణ, శేఖర్, హెచ్‌ఎం వేణుగోపాల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగ ఫలితమే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం

రాయదుర్గంటౌన్: అమరవీరుల త్యాగ ఫలితమే స్వేచ్ఛ, స్వాతంత్ర్యమని, సమరయోధుల తాగాలను నేటి తరానికి తెలిజెప్పాలని బాధ్యతపై మనందరిపై ఉంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ వేడుకల్లో భాగంగా నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌తోపాటు వైస్ చైర్మన్‌లు, కౌన్సిల్ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, అధికారుల, సిబ్బంది కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. నాభూమి–నాదేశం, వీరులకు వందనం శిలాఫలాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆవిష్కరించి అందరితో కలిసి పంచ ప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు శ్రీనివాస యాదవ్, వలిబాషా, మున్సిపల్ డీఈ సురేష్, కౌన్సిలర్లు గోవిందరాజులు, శారదమ్మ, శ్రీలక్ష్మి, ఫకృద్దీన్, పెద్ద వన్నూరుస్వామి, శివపుత్ర, శ్రీనివాసరెడ్డి, కోఆప్షన్ సభ్యులు నజీర్, శ్రీనివాసులు, డిష్ గోవిందు, వార్డు ఇన్‌చార్జ్‌లు గోల్డ్ ఇస్మాయిల్, పొరాళ్ల శివకుమార్, బషీర్ అహ్మద్, శివప్ప, కృష్ణమూర్తి, నిజాముద్దీన్, గంగాధర్, మున్సిపల్ అధికారులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని గొల్లపల్లి, మారెంపల్లి,గోనబావి, సిరిగెదొడ్డి ,75వీరాపురం, కె.పి.దొడ్డి గ్రామాల్లో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి నా దేశం కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు,ఉపాధి సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నాభూమి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ వెంకటేశులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, పార్టీ పట్టణ అధ్యక్షుడు గోపారం శ్రీనివాసులు ,పట్టణ జేసీఎస్ కన్వీనర్ అర్చన, కౌన్సిలర్ తిరుమల వెంకటేశులు, సీనియర్ నాయకులు సుధీర్, హరి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం నక్కలపల్లి సమీపంలోని దేవావయశాఖ భూమిలో చింత మొక్కలు నాటారు ఉపాధిహామీ అధికారులు గ్రామస్తులతో కలసి నాటారు. ఉపాధి ఏపీఓ ఆంజనేయులు, సర్పంచ్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కోటేశ్వరరెడ్డి, వన్నూరుస్వామి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.